ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

ములుగురూరల్/గోవిందరావుపేట/వెంకటాపూర్/భూపాపల్లి రూరల్, జనవరి 20 : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ఆమె ములుగు ప్రభుత్వ దవాఖాన వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటిన్‌ను కలెక్టర్ టీఎస్ దివాకర, ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్, అదనపు కలెక్టర్ సంపత్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కార్పొరేట్ కంపెనీల సాయంతో ఎనిమిది గ్రామాలను దత్తత తీసుకొని రూ.2.5 కోట్లతో పనులను చేపట్టామన్నారు. అభివృద్ధి పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ నాణ్యతతో పూర్తి చేయించాలని సూచించారు. కార్యక్రమంలో దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మోహన్‌లాల్, డీపీవో దేవరాజు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ పాల్గొన్నారు. అలాగే, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ అధ్యక్షతన ఆర్డీవో కార్యాలయంలో జరిగిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో మంత్రి సీతక్క పాల్గొని జర్నలిస్టులతో పాటు పలువురు వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు.

ములుగు రూరల్ : వాహనదారుడికి హెల్మెట్ తొడుగుతున్న మంత్రి సీతక్క

అనంతరం మంత్రి ఐజేయూ యూనియన్ డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు షఫీఅహ్మద్, జర్నలిస్టులు ముకులోత్ శరత్, మాట్ల సంపత్, రఘువీర్, కొమురయ్య, సృజన్, ప్రభాకర్, భిక్షపతి పాల్గొన్నారు. కాగా, గౌడ కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ గౌడ జేఏసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. గోవిందరావుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సింక్రోని ఓపెన్ టెస్ట్స్ సంస్థల సహకారంతో నిర్మాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమకూర్చిన 130 సైకిళ్లను మంత్రి సీతక్క పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు మజూర్, ప్రియా పాల్గొన్నారు. వెంకటాపూర్ మండల కేంద్రంలో రూ.1.20కోట్లతో నిర్మించిన పీఏసీఎస్ భవనం, రూ.8లక్షలతో నిర్మించిన రామాంజనేయ స్వామి ఆలయ ప్రహరీ, రూ.5లక్షలతో నిర్మించిన లక్ష్మీదేవర ఆలయ ప్రహరీని మంత్రి ప్రారంభించారు. కాగా, పీఏసీఎస్ భవనాన్ని ప్రోటోకాల్ పాటించకుండా మంత్రి సీతక్క ప్రారంభించారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి ఆరోపించారు. శిలాఫలకంపై స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పేర్లు పెట్టకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, భూపాలపల్లి మండలం బావుసింగ్‌పల్లి పంచాయతీ పరిధి లక్ష్మీపురం తండాలో రూ.10లక్షలతో నిర్మించనున్న రోడ్డు పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. కలెక్టర్ రాహుల్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణ రావు, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై గ్రామస్తులకు అవగాహన

ములుగురూరల్/కాటారం, జనవరి 20: ములుగు మండలంలోని జగ్గన్నపేటను సోమవారం విద్యుత్ ఎస్ఈ మల్చూర్‌నాయక్, ఆపరేషన్ డీఈఈ నాగేశ్వర్‌రావు, టీజీ రెడ్కో డీఎం మహేందర్‌రెడ్డి, ములుగు ఏఈ రవి, సబ్ ఇంజినీర్ హరీశ్, లైన్‌మన్ సజీత్, సిబ్బంది సందర్శించారు. గ్రామాన్ని సోలార్ మోడల్ విలేజ్‌గా మార్చడంలో భాగంగా విద్యుత్ వినియోగదారులను కలిసి మాట్లాడారు. సోలార్ ద్వారా విద్యుత్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. అలాగే, భూపాలపల్లి జిల్లాలోని కాటారం గ్రామం కూడా మోడల్ సోలార్ విలేజ్‌గా ఎంపిక కావడంతో ఎస్ఈ మల్చూర్‌నాయక్ సోమవారం సాయంత్రం గ్రామస్తులకు రైతు వేదికలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఈ నాగరాజు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులకు నోటీసులు

కాటారం, జనవరి 20 : మండలంలోని రేగులగూడెం పంచాయతీ పరిధిలోని గంగారం క్రాస్ వద్ద అనుమతి లేకుండా నిర్మిస్తున్న ఇళ్లకు అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. అక్రమంగా జరుగుతున్న నిర్మాణ పనులను మండల పంచాయతీ అధికారి వీరస్వామి, పంచాయతీ కార్యదర్శులు నిలిపేశారు. నోటీసులు జారీ చేసినా పట్టించుకోకుండా పనులు చేస్తుండడంతో పంచాయతీ కార్యదర్శుల బృందంతో పాటు సిబ్బంది వెళ్లి పనులు నిలిపేశారు. అనుమతులు తీసుకున్న తర్వాతనే పనులు నిర్వహించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కృష్ణవేణి, కర్ణాకర్, శ్రీనివాస్, గంగాధరన్, సిబ్బంది పాల్గొన్నారు.

దవాఖానల్లో తనిఖీ

మహాముత్తారం, జనవరి 20 : మండలంలోని బోర్లగూడెం హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం సోమవారం పరిశీలించింది. (NQAS) బృందం సభ్యులు డాక్టర్ ఆనంది సత్యకుమార్, డాక్టర్ కిరణ్ పాటిల్ రికార్డులను పరిశీలించి వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్, జిల్లా ప్రొగ్రామింగ్ అధికారులు శ్రీదేవి, ఉమాదేవి, ప్రమోద్, వైద్యులు సందీప్, క్వాలిటీ మేనేజర్ శరత్, డీపీవో చిరంజీవి, డీడీ మధుబాబు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూముల పరిశీలన

మొగుళ్లపల్లి, జనవరి 20 : మండలంలోని రంగాపురం, మేదరమెట్ల గ్రామాల్లో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి సేకరించనున్న భూములను సోమవారం భూపాలపల్లి ఆర్డీవో రవి పరిశీలించారు. అనంతరం గ్రామాల్లో చేపడుతున్న సర్వే వివరాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ సునీత, ఆర్ఐ, ఏవో తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కావలెను

jobs Apply Now!

★వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ లో పనిచేయుటకు కంప్యూటర్ MS OFFICE, WORD, EXCEL ఆపరేటింగ్ లో డిగ్రీ అర్హతతో తెలుగు & ఇంగ్లీష్ TYPE Writing లో అనుభవం కలిగిన మహిళలు/ పురుష అభ్యర్థులు మరియు ఆఫీసులో పనిచేయుటకు ఆఫీస్ బాయ్స్ అర్జెంటుగా కావలెను. సంప్ర :9866160555

NTW-326584

WANTED

★MEDICAL SHOP STAFF (Exp.), System Operators (Exp.), Hospital Administrators (Exp.), LAB Technicians (Exp.), OT-Technicians (Exp.) Required for Guardian Hospital, Mulugu 'X' Road, Warangal. Cont: Time 12 to 2 PM.

NTW-467

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

ఇంట్లో ప్రేమ పెళ్లికి ఒప్పుకోలేదని ఇద్దరు యువకుల ఆత్మహత్య

భరత్‌కుమార్, మహేశ్(ఫైల్)

మొగుళ్లపల్లి/మహాముత్తారం, జనవరి 20 : ప్రేమించిన అమ్మాయితో వివాహం జరిపించడం లేదని కుటుంబ సభ్యులతో గొడవపడి ఇద్దరు యువకులు వేర్వేరు చోట్ల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మొగుళ్లపల్లి మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన సంగ భరత్ కుమార్(20) కొంత కాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఆమెతో వివాహం జరిపించాలని ఇంట్లో తండ్రితో మూడు రోజుల నుంచి గొడవ పడుతున్నాడు. తల్లి సంవత్సరికం కాగానే మాట్లాడుదామని తండ్రి చెప్పగా ఇంట్లోని వస్తువులను భరత్‌కుమార్ పగుల కొట్టి, ఆదివారం రాత్రి వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి కుమార స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్‌తెలిపారు. అలాగే, మహాముత్తారం మండలంలోని సింగంపల్లికి చెందిన వాసం మహేశ్(24) కూడా ప్రేమించిన అమ్మాయితో కుటుంబ సభ్యులు పెళ్లికి ఒప్పుకోవడం లేదని మనస్తాపంతో మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగాడు. స్థానికులు అతడిని భూపాలపల్లి దవాఖానకు తరలించగా ఆదివారం పరిస్థితి విషమించడంతో ఎంజీఎం దవాఖానకు పంపించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సిద్ధార్థరెడ్డి(ఫైల్)

మొగుళ్లపల్లి, జనవరి 20 : చేతికి అందివచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతిచెంచడంతో తల్లిదండ్రుల రోదన కలిచివేసింది. మండలంలోని బద్ధంపల్లి గ్రామానికి చెందిన బద్ధం సిద్ధార్థరెడ్డి(20) జనగామ మండలం పెంబర్తి గ్రామ వై జంక్షన్ సమీపంలో తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. బద్ధంపల్లి గ్రామానికి చెందిన బద్ధం మహేందర్‌రెడ్డి- రమ దంపతుల కుమారుడు సిద్ధార్థరెడ్డి హనుమకొండలోని ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. సోమవారం తెల్లవారుజామున కారులో మిత్రులతో కలిసి హైదరాబాద్‌కు వెళుతున్న క్రమంలో జనగామ మండలం పెంబర్తి సమీపంలో సడెన్ బ్రేక్ వేయడంతో కారు పల్టీలు కొట్టి రోడ్డు పక్కన పడిపోయింది. దీంతో కారు నడుపుతున్న సిద్ధార్థరెడ్డి బయటకు ఎగిరిపడడంతో బలమైన గాయాలయ్యాయి. జనగామ హాస్పిటల్‌కు తీసుకెళ్తుండగా మధ్యలో మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్..

ప్రశాంత్(ఫైల్)

మంగపేట, జనవరి 20: మండలంలోని మొట్లగూడెం సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి చెందాడు. ఎస్సై టీవీఆర్ సూరి కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకకు చెందిన కారం ప్రశాంత్(24) ఈ నెల 19న జామాయిల్ కర్ర లోడు కోసం మంగపేట మండలం నర్సింహాసాగర్ గ్రామానికి వచ్చాడు. అక్కడ కర్ర లోడు చేసుకొని అదే రోజు రాత్రి బయలు దేరి సారపాకకు వెళ్తుండగా మొట్లగూడెం వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన పంట పొలాల్లో బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజిన్ ప్రశాంత్‌పై పడడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సోమవారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా పూర్తి చేశారు. మృతుడి తాత మడకం రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వీధికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

ములుగురూరల్, జనవరి 20 : వీధి కుక్క దాడిలో ఐదుగురికి గాయాలైన ఘటన ములుగు మండలంలోని రామచంద్రాపురంలో సోమవారం ఉదయం జరగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నీలా, ఇంద్రారెడ్డి, విద్యాన్‌తే, యాకూబ్‌పై వీధి కుక్క దాడి చేసింది. రామచంద్రాపురం గ్రామానికి పని నిమిత్తం వెళ్లిన శివతండాకు చెందిన పోల్‌సింగ్‌పై సైతం దాడి చేసి కరిచింది. గాయపడిన వారు ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు రాగా వైద్యులు చికిత్స అందించారు. కాగా, గ్రామంలో వీధి కుక్కల బెడదను నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

వాజేడు, జనవరి 20 : ఛత్తీస్‌గఢ్ నుంచి బైక్‌పై గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. మండలంలోని గుమ్మడిదొడ్డిలో సోమవారం వెంకటాపురం సీఐ బండారు కుమార్, వాజేడు ఎస్సై రాజ్‌కుమార్ వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో ఆపి పరిశీలించారు. సంచుల్లో గుడుంబా ప్యాకెట్లు ఉండడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం తాళ్లగూడెం గ్రామానికి చెందిన దుర్గం ప్రవీణ్‌గా గుర్తించి, 120 లీటర్ల గుడుంబాతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఏఎస్సై లతీఫ్, హెడ్‌కానిస్టేబుళ్లు హరిప్రసాద్, తిరుపతి, కానిస్టేబుళ్లు నాగార్జున, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, హోంగార్డులు పొలిశెట్టి గోవింద్, నర్సయ్య పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

కాటారం, జనవరి 20 : ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కాటారం పోలీస్‌స్టేషన్‌లో సీఐ నాగార్జున రావు, ఎస్సై అభినవ్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రమాదాలు జరుగకుండా డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన తనిఖీల్లో సహకరించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన కూడలి వరకు ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. ట్రైనీ ఎస్సై హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై గుంతలు పూడ్చిన పోలీసులు

ఏటూరునాగారం, జనవరి 20 : ప్రమాదాల నియంత్రణలో భాగంగా క్రాస్‌రోడ్డులోని రహదారిపై గుంతలను పోలీసులు సోమవారం పూడ్చివేశారు.. ఐటీడీఏ పీవో నివాస గృహానికి మూడు వైపులా మలుపుల వద్ద ఇసుక లారీలు, భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమై గోతులు పడ్డాయి. దీంతో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని గమనించిన ఎస్సై తాజుద్దీన్ మట్టి, కంకరతో తెప్పించి జేసీబీతో చదును చేయించారు.

పేదలకు ఇండ్ల స్థలాలు అప్పగించాలి

జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

ములుగురూరల్, జనవరి 20 : తాడ్వాయి మండలం కాటాపురం గ్రామానికి చెందిన లబ్ధిదారులకు వెంటనే ఇంటి స్థలాలను కేటాయించాలని ములుగు జడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గ్రామానికి చెందిన లబ్ధిదారులతో కలిసి ములుగులో కలెక్టర్ టీఎస్ దివాకరను కలిసి వినతిపత్రం అందజేశారు. నాగజ్యోతి మాట్లాడుతూ 2023లో సర్వే నంబర్ 147లో 108మంది నిరుపేద కుటుంబాలకు 75 గజాల చొప్పున ఇళ్ల స్థలాలను గత ప్రభుత్వం కేటాయించినట్లు తెలిపారు. వాటిని లబ్ధిదారులకు అప్పగించే సమయంలో ఎన్నికలు రావడంతో జాప్యం జరిగిందన్నారు. ఇప్పటికీ మండల రెవెన్యూ అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో లబ్ధిదారులు ఇండ్ల స్థలాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి వెంటనే స్థలాలను అప్పగించాలని కలెక్టర్‌ను కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ 15 రోజుల్లో


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బడే నాగజ్యోతి

సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు నాగజ్యోతి వివరించారు. ఆమె వెంట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, మాజీ జడ్పీటీసీ రామ సహాయం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు పులి నర్సయ్య, పుల్లూరి గౌరమ్మ, మాజీ ఎంపీటీసీ దానక నర్సింగరావు, పీఏసీఎస్ చైర్మన్ ఇందారపు లాలయ్య, సయ్యద్ హుస్సేన్, సాయిరి లక్ష్మీనర్సయ్య, లంజపెల్లి రాంబాబు, పుల్లూరి రమ, 50మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యుత్ ఆర్టిజన్స్ సమస్యలు పరిష్కరించాలి

కృష్ణ కాలనీ/గణపురం, జనవరి 20 : తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల్లో పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్స్‌ను వారి విద్యార్హతలను బట్టి వెంటనే కన్వర్షన్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ కే ఈశ్వర్‌రావు అన్నారు. రాష్ట్రంలోని ఆర్టిజన్స్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల నెరవేర్చాలని కోరుతూ టీవీఏసీ- జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని టీజీఎన్పీడీసీఎల్ డీఈ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలను ఈశ్వర రావు ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని గతంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ట్రాన్స్‌కో సీఎండీలను కలిసి వినతి పత్రాలను సైతం అందజేశామన్నారు. అయినా ఇప్పటివరకు నిర్ణయం తీసుకోకపోవడం బాధాకరమన్నారు. విద్యుత్ శాఖలో ఒకే సమస్య-ఒకే రూల్ అమలు చేయాలన్నారు. డిమాండ్లు నెరవేర్చాలని ఫిబ్రవరి 3 నుంచి 13 వరకు రాష్ట్ర జేఏసీ నాయకుల కన్వర్షన్ యాత్ర నిర్వహిస్తున్నామని, ఫిబ్రవరి 20న హైదరాబాద్‌లో చలో విద్యుత్ సౌద సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా చైర్మన్ తిప్పారపు రాజు, కోకన్వీనర్ మోత్కూరి కోటి, కోవైర్మన్ ఎల్ రాజయ్య, కన్వీనర్ కే భాస్కర్, ఎండీ అంకుషావలి, బత్తుల రాజేందర్, దాస్యపు స్వామి, ఇనుగాల కుమార్, కృష్ణమూర్తి, విజేందర్, మధు, పూర్ణ, అశోక్,

కృష్ణకాలనీ : టీజీఎన్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న టీవీఏసీ జేఏసీ నాయకులు

సాంబమూర్తి శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నవీన్, డీ రామయ్య, భూపాలపల్లి జెన్‌కో నాయకులు చిలువేరు మల్లయ్య, కిరణ్ పాల్గొన్నారు. అలాగే, గణపురం మండలం చెల్పూరు కేటీపీపీలో జేఏసీ చైర్మన్ కన్వీనర్ అల్లం ఓదెలు బీరెల్లి రాజు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించగా ఈశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా ప్రారంభించారు. కేటీపీపీ రీజినల్ అధ్యక్షుడు కొండా శ్రీనివాస్, వివిధ నాయకులు చిలువేరు మల్లయ్య, కోల శ్యాం, బానోత్ నరసింహ థామ్సన్, జగ్గారావు రామనాయక్, రఘోత్తంరెడ్డి, బాలు, భీమా నాయక్, మంజు నాయక్, రవీందర్, రమేశ్, శ్రీనివాస్, సమీరొద్దీన్, సంపత్ రావు, గోపీ, సందీప్, హరికృష్ణ, తిరుపతి, పురుషోత్తం, ఇనుగాల కుమారస్వామి, హేమ నాయక్ పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

ములుగురూరల్/భూపాపల్లి రూరల్/మహాముత్తారం/మహదేవపూర్/ కాటారం/మొగుళ్లపల్లి, జనవరి 20 : తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం రాములుపై జరిగిన దాడిని ఖండిస్తూ ములుగు, భూపాపల్లి జిల్లాల వ్యాప్తంగా పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు సోమవారం మధ్యాహ్న భోజన విరామంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ములుగు మండలం మల్లంపల్లి జడ్పీ హెచ్ఎస్‌లో పీఆర్‌టీయూ నాయకుడు వేం యాకూబ్‌రెడ్డి, టీపీటీఎఫ్ నాయకుడు దిలీప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే, భూపాపలపల్లిలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు నిరసన ప్రదర్శన చేపట్టారు. మహాముత్తారం మండలంలోని అన్ని పాఠశాలల్లో నిరసన తెలిపినట్లు డీటీఎఫ్ మండల అధ్యక్షుడు జాటోత్ రామ్ సింగ్ తెలిపారు. మహదేవపూర్ ఎంఆర్‌సీ భవనం ఆవరణలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. డీటీఎఫ్ జిల్లా కన్వీనర్ బీ తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాటారం మండలంలోని సుందర్‌రాజ్‌పేట, పలు పాఠశాలల్లో నిరసన చేపట్టారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు. మొగుళ్లపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పింగిలి విజయపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పోలు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు

ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం, జనవరి 20 : స్వయం సహాయక సంఘాల ద్వారా సౌర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను గిరిజన ప్రాంతాల్లో నెలకొల్పనున్నట్లు, ఇందుకు ఆసక్తి కలిగిన ఆర్‌వోఎఫ్ఆర్ పట్టా కలిగిన రైతులు ముందుకు రావాలని ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా కోరారు. మండల కేంద్రంలో సోమవారం పీఎం కుసుమ్ స్కీంపై పెసా మొబిలైజర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ నాలుగు ఎకరాలు కలిగిన ఆర్‌వోఎఫ్ఆర్ లేదా రెవెన్యూ పట్టా కలిగి విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న రైతులకు ఈ అవకాశం ఉందన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు ఏర్పాటు చేసే ప్లాంట్ కోసం 25 ఏళ్ల పాటు లీజ్‌కు కూడా తీసుకునే అవకాశం ఉందని, ఇందుకు ఏటా ఎకరానికి రూ.12,500 చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ పథకంపై ఆసక్తి కలిగిన రైతులను ఈ నెల 25లోగా గుర్తించాలని పీవో సూచించారు. పూర్తి వివరాల కోసం ఐటీడీఏ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. 27న మండలాల వారీగా

సమావేశంలో మాట్లాడుతున్న పీవో చిత్రమిశ్రా

మొబిలైజర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని పెసా జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్‌ను ఆదేశించారు. సమావేశంలో ఏవో మంతెన రాజ్‌కుమార్, డీటీలు అనీల్, వెంకన్న, పెసా కో ఆర్డినేటర్ ప్రభాకర్, జిల్లాలోని తొమ్మిది మండలాలకు చెందిన పెసా మొబిలైజర్లు పాల్గొన్నారు. కాగా, స్థానిక ఐటీడీఏ కార్యాలయంలోనిర్వహించిన గిరిజన దర్బార్‌లో పీవో చిత్రామిశ్రా వినతులు స్వీకరించారు. పలువురు తమ సమస్యలపై వినతులు సమర్పించారు. దర్బార్‌లో డీడీ పోచం, ఏవో రాజ్‌కుమార్, అధికారులు కిశోర్, ప్రభాకర్, జగన్ మోహన్‌రెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

మహిళ వైద్యచికిత్సకు సాయం చేయాలని వేడుకోలు

చికిత్సపొందుతున్న నాగలక్ష్మి

వాజేడు, జనవరి 20 : మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన వాసం నాగలక్ష్మి ఆదివారం ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి జారిపడి గాయపడింది. కుటుంబ సభ్యులు ఆమెను చికిత్స కోసం హనుమకొండకు తరలించారు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు బ్రెయిన్‌లో రక్తం గడ్డ కట్టిందని, వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పారు. అందుకు రూ.4లక్షలు పైగా ఖర్చు అవుతుందని తెలిపారు. ఆమెది నిరుపేద కుటుంబం కావడంతో దాతల సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఎవరైనా దాతలు ఉంటే 9515490398 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

జ్యూట్ బ్యాగు తయారీలో శిక్షణ

ఏటూరునాగారం, జనవరి 20: ఐటీడీఏ, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీలో 13 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు దాటిన వార